క్లుప్తంగా

భూముల అన్యక్రాంతంపై విచారణ జరపాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ సర్పంచ్, పేదలు

బెల్లంపల్లి: మండలంలోని ఆకెనపల్లి శివారులో పేదలకు పంపిణీ చేసిన భూములు అన్యక్రాంతం అయ్యాయని వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సోమగూడెం పంచాయతీ మాజీ సర్పంచ్ కోర కొప్పుల ప్రమీలగౌడ్, ఎంపీటీసీ సభ్యురాలు చుంచు మల్లమ్మ జిల్లా కలెక్టర్ సంతోష్‌కు విన్నవించారు. గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆకెనపల్లి శివారు సర్వే నెంబర్ 3 పైకిలో పోలవు చిరంజీవి, దాసరి లక్ష్మారెడ్డి, శ్యామల మల్లేశం అనే పేదలకు ప్రభుత్వం కేటాయించిన భూమి దుర్వినియోగ మైందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. చిరంజీవి అనే వ్యక్తి కారుకూరి రాంచందర్‌తో కుమ్మక్కై ఆ భూమిలో ప్లాట్లు వేసి అధిక ధరకు అమ్మకాలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

మట్టి నమూనాల సేకరణ



మట్టినమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

జైపూర్: మండలంలోని గంగిపల్లి గ్రామంలో రైతులు తిరుపతి, సుదర్శన్ పొలాల్లో గురువారం తెలంగాణ వ్యవసాయ కళాశాల విద్యార్థుల బృందం భూసార పరీక్షల కోసం మట్టినమూనాలు సేకరించారు. రైతులు ప్రతి ఏటా పంటలకు ఒక్కసారి తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకోవాలని విశ్లేణ ఫలితాల ఆధారంగా ఎరువల వినియోగం చేయాలన్నారు. తద్వారా పెట్టుబడి వ్యయం తగ్గి నికర ఆదాయం పెరగడమే కాకుండా భూసారాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. కళాశాల విద్యార్థి ముత్యం తిరుపతి, కృషి అనుభవ కార్యక్రమ విద్యార్థులు వివేక్, శ్రీవాత్సవ రాంప్రసాద్, హర్షిత్ ఉన్నారు.

గాంధారి మైసమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

కోటపల్లి: మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులో ఈనెల 25న నిర్వహించే గాంధారి ఖిల్లా మైసమ్మ జాతర పోస్టర్‌ను కోటపల్లిలో తహసీల్దార్ మహేంద్రనాథ్ ఆవిష్కరించారు. ఈనెల 23న గంగాస్నానాలు, 24న సాధర్ బీమన్న పూజ తర్వాత మైసమ్మ గుట్టపై పూజ, 25న జాతర సాంస్కృతిక కార్యక్రమాలు దర్బార్ ఉంటుందని ఆదివాసీ సంఘం నాయకుడు, ఎంపీటీసీ జేక శేఖర్ తెలిపారు. నాయకులు మేకల మహేందర్, బిస్కుల లక్ష్మణ్, సారయ్య పాల్గొన్నారు.

'భూకబ్జా ఆరోపణలు అవాస్తవం'

బెల్లంపల్లి: బీఆర్ఎస్ నాయకురాలు, సోమగూడెం మాజీ సర్పంచ్ ప్రమీలగౌడ్ కాంగ్రెస్ నాయకులపై చేసిన భూకబ్జా ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని బెల్లంపల్లి మండల కాంగ్రెస్ నాయకులు ముత్తే భూమయ్య, జైన శ్రీనివాస్, మడిపల్లి శంకర్ తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆకెనపల్లి శివారు సర్వే నెంబర్ 3 పైకి లో 2.75 ఎకరాల భూమిని పట్టేదారు జెగ్యా నాయక్ వద్ద నుంచి కొన్నాళ్ల క్రితం 32 మంది కొనుగోలు చేశారని తెలిపారు. ఒక్కొక్కరు 3 గుంటల చొప్పున కొన్నారని, అందుకు సంబంధించి తమపేర్లపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. ఆ భూమికి రైతుబంధు డబ్బులు కొనుగోలుదారులు తీ సుకుంటున్నారని వివరించారు. ఆ విషయాలను దాచిపెట్టి మాజీ సర్ప ంచ్ ప్రమీల గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కారుకూరి రాంచందర్ ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ప్లాట్లువేసి అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. ఆమె చేసిన ఆరోపణలను కొట్టిపారేశారు. జెల్ల చిన్నయ్య, కందుల లింగయ్య, గోమాస భీమయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామకృష్ణాపూర్: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన పట్టణంలోని మల్లికార్జున్‌నగర్‌కు చెందిన గుడిసె కొమురయ్యకు స్థానిక కాంగ్రెస్ నాయకులు రూ.5వేల ఆర్థికసాయంతోపాటు నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, రఘునాథ్‌రెడ్డి, గోపతిరాజయ్య, అబ్దుల్‌అజీజ్ పాల్గొన్నారు.

గద్దెపైకి సమ్మక్క ఆగమనం

- దర్శించుకున్న భక్తులు
- మొక్కులు చెల్లింపు



హాజీపూర్ మండలం బుగ్గగట్టు వద్ద సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద భక్తుల మొక్కులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గుడిపేట-నబ్బేపల్లి శివారుల్లోని బుగ్గగట్టు వద్ద మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసిన సమ్మక్క-సారలమ్మ జాతర వైభవంగా సాగుతోంది. జెడ్పీటీసీ దంపతులు పూస్కూరి శిల్ప-శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ జాతరను వనంలో ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి 7 గంటల వరకు సమ్మక్కను గిరిజన సంప్రదాయ పద్ధతిలో కోయరాజులు పూనకాల మధ్య గద్దెపైకి తీసుకురావడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున హాజరవుతున్నారు. మేకలు, కోళ్లతో పాటు తమ ఎత్తు బంగారం(బెల్లం) తూకం వేయిస్తూ అమ్మవార్లకు మొక్కులు సమర్పించుకుంటున్నారు. ఒకేరోజున సమ్మక్కతో పాటు సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజులు కొలువుదీరి ఉండటంతో భక్తుల ఆనందపారవశ్యం అంతాఇంతా కాదు. మేడారం నుంచి వచ్చిన కోయ పూజార్లు సమ్మక్కను ప్రతిష్ఠించడంతో భక్తులు రాత్రి వరకు దర్శనం చేసుకున్నారు. జాతర సందర్భంగా పూస్కూరి వరప్రసాదరావు ఆధ్వర్యంలో అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేమనపల్లి: మండలంలోని మంగెనపల్లి, కొత్త కాలనీల వద్ద సమ్మక్క-సారలమ్మ జాతర అట్టహాసంగా జరిగింది. పూజార్ల ఆధ్వర్యంలో వేమనపల్లిలో ఉన్న కంకవనం నుంచి సమ్మక్కను పసుపు కుంకుమలతో గద్దె వద్దకు తీసుకువచ్చారు. బాజాభజంత్రీలు, మంగళహారతుల మధ్య శోభాయమానంగా జాతర కొనసాగింది. మండలంతోపాటు దహెగాం, కన్నెపల్లి, భీమిని, కోటపల్లి, నెన్నెల మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చెన్నూర్: పట్టణంలోని బతుకమ్మ వాగు సమీపంలో గల సమ్మక్క, సారలమ్మ జాతరకు భక్తజనం పోటెత్తింది. సమ్మక్క-సారలమ్మను గద్దెలకు చేరడంతో భక్తులు మొక్కు చెల్లించేందుకు బారులు తీరారు. పట్టణవాసులతోపాటు చింతలపల్లి, అక్కెపల్లి, శివలింగపూర్ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కు చెల్లించుకున్నారు. అర్చకుడు బానయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: సుబ్బరాంపల్లి, కిష్టంపేట గ్రామాల సమీపాలలోని సారలమ్మ గద్దె వద్దకు బుధవారం రాత్రి సారలమ్మను తీసుకువచ్చారు. గురువారం సమ్మక్కను గద్దెపైకి తీసుకువచ్చారు. భక్తులు దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. శుక్రవారంతో జాతర ముగియనుంది.

కోటపల్లి: మండలంలోని మల్లంపేట, రాపన్‌పల్లి గ్రామాల్లో సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా జరిగాయి. సమ్మక్క, సారలమ్మను గద్దెలపై తీసుకురావడంతో భక్తులు మొక్కు చెల్లించుకున్నారు. మల్లంపేటలో ఎంపీడీవో భూమన్న మొక్కులు చెల్లించుకున్నారు.

నెన్నెల: మండల కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన గిరిజన మహిళలు బోనాలు పూజారి ధర్మయ్య ఊరేగింపుగా ప్రకృతివనంలోని అటవీ ప్రాంతంలోని సమ్మక్క-సారలమ్మల వద్దకు చేరుకొని గురువారం ఒడియ్యంతో మొక్కులు చెల్లించుకున్నారు. భాజాభజంత్రీలు డప్పుచప్పుళ్లతో గ్రామదేవతలైన లక్ష్మీదేవర మారమ్మ పోతరాజులతో వీధుల్లో శివసత్తులు నత్యాలు చేస్తూ భారీగా తరలివెళ్లి అమ్మవార్లకు దర్శించుకుని నిలువెత్తు బంగారం చీరే,సారేలను సమర్పించారు.

శ్రీరాంపూర్: సీసీసీలోని ముక్కిడి పోశమ్మ ఆలయం వద్ద గురువారం సమ్మక్క వనం నుంచి గద్దెలకు చేరింది. కంకవనం నుంచి కోయ పూజార్లు వచ్చిన సమ్మక్కకు తీసుకురాగా, కంపెనీ అధికారులు ఘన స్వాగతం పలికారు. గద్దెల వద్ద శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, ఆయన సతీమణి రాధాకుమారి పూజలు నిర్వహించారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఎస్‌ఓటూజీఎం రఘుకుమార్, డీజీఎం (పర్సనల) అరవిందరావు, డీజీఎం(సివిల్) ఆనంద్‌కుమార్, సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, అధికారులు సుదర్శన్, కాంతారావు, శ్రీనివాస్, సీఎంఓఏఐ సెక్రెటరీ చంద్రశేఖర్, పూజారి రమేశ్ పాల్గొన్నారు.



వేమనపల్లి: కంకవనంతో బయల్దేరిన పూజార్లు



శ్రీరాంపూర్: జీఎం దంపతుల పూజలు



నెన్నెలలో గద్దెల వద్దకు వెళ్తున్న గిరిజనులు



చెన్నూర్ మండలం సుబ్బరాంపల్లిలో..



చెన్నూర్‌లో..



చెన్నూర్‌లో దర్శనం కోసం భక్తుల బారులు



కోటపల్లి: సమ్మక్కను దర్శించుకుంటున్న ఎంపీడీవో



వేమనపల్లి: మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఘనంగా బెడెన్ పావెల్ జయంతి



పూలమాల వేస్తున్న జీఎం మనోహర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్‌లో స్కౌట్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు బెడెన్ పావెల్ జయంతిని సింగరేణి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరుపుకొన్నారు. జీఎం మనోహర్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఆ యన పుట్టిన రోజును ప్రపంచ ఆలోచన దినో త్సవంగా జరుపుకోవడం సంతోషమన్నారు. పాఠశాల కరస్పాండెంట్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, హెచ్చెమ్ పురుషోత్తం, స్కౌట్ మాస్టర్ శక్తికుమార్, గైడ్స్ మాస్టర్ కల్పలత, పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులున్నారు.

ఒత్తిడిని జయిస్తే విజయం

జన్నారం: విద్యార్థులు ఒత్తిడిని జయిస్తే విజయం సాధిస్తారని ప్రముఖ సైకాలజిస్టు, మోటివేషన్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బానవత్ ప్రకాశ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ విద్యార్థులకు మోటివేషన్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఫోన్ ద్వారా ఉచితంగా కౌన్సెలింగ్ ఇవ్వడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. పరీక్షలంటే ముందుగా విద్యార్థులు భయం పోగొట్టుకోవాలన్నారు. వీరి కోసం ఫోన్లలో కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. ప్రతీరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు 9441158893, 9398617711 సెల్‌నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెల్ల పురుగులతో ఇబ్బంది

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని సాయికుంట చెరువు పరిసర ప్రాంతాల ప్రజలు తెల్ల పురుగులతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీరోజు సాయంత్రం కాగానే తెల్ల పురుగులు ఒక్కసారిగా ఇళ్లల్లోకి వస్తున్నాయి. చెరువులో మురుగు నీరు చేరడం, పురుగులు రాకుండా చర్యలు తీసుకోకపోవడంతో స్థానికంగా ఉండే ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. ఇప్పటికే దోమల తాకిడికి తట్టుకోలేకపోతున్న తమకు ఈ తెల్ల పురుగులు మరింత ఇబ్బందిగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై ఇప్పటికే మున్సిపల్ కమిషనర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

అల్పాహారం పంపిణీ



భక్తులకు అల్పాహారం అందిస్తున్న నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం సభ్యులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా తరపున జిల్లా కేంద్రంలోని గోదావరి నది ఒడ్డున జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు గురువారం అల్పాహారం పంపిణీ చేశారు. అధ్యక్షుడు గీట్ల సుమీత్, సెక్రెటరీ గోవర్దన్, ఉపాధ్యక్షురాలు కవిత, కోశాధికారి శ్రీనివాస్, కార్యనిర్వాహణ కార్యదర్శి హఫీజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాసవిక్లబ్ ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలోని గోదావరి నది ఒడ్డున జాతరకు వచ్చిన భక్తులకు వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ఉప్మా, మంచినీటిని గురువారం పంపిణీ చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మేడారం వెళ్లే భక్తులకు, ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లకు ఆర్యవైశ్య సేవా సమితి ద్వారా ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

ఎయిమ్స్ వైద్యుల అరుదైన ఘనత



పేషెంట్‌తో డాక్టర్లు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఎయిమ్స్ ఆసుపత్రి వైద్యులు గురువారం అరుదైన ఘనత సాధించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ యెగ్గెన మాట్లాడుతూ పాతమంచిర్యాలకు చెందిన వృద్ధురాలు తోట సత్తమ్మకు తుంటి ఎముక విరిగి ఆసుపత్రిలో అడ్మిట్ అయిందన్నారు. పేషెంట్‌కు బీపీ, అన్‌కంట్రోల్డ్ షుగర్స్, గుండెకు సంబంధించి (ఈఎఫ్ 35 శాతం, ఆర్‌డబ్ల్యూఎం ప్లస్) చుట్టూ నీరు చేరుకుని శ్వాస పీల్చుకోవడంలో సమస్య ఉందన్నారు. ఎమర్జెన్సీ క్రిటికల్ సహాయంతో కరెక్ట్ చేసి ఆపరేషన్ విజయవంతంగా పూర్తిచేశామన్నారు. మరుసటి రోజు పేషెంట్‌ను నడిపించామన్నారు. ఆమె కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్య బృందం పత్తి సత్యనారాయణ, అనస్థిషియా, శ్రీకాంత్ యెగ్గెన ఎమర్జెన్సీ మెడిసిన్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసం షీటీం



మాట్లాడుతున్న వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్య

బెల్లంపల్లి: మహిళల రక్షణ కోసమే షీటీం ఏర్పాటు చేసినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య తెలిపారు. బెల్లంపల్లి బస్తీలోని ఎస్సీ సమీకృత బాలికల వసతిగృహం విద్యార్థినులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ మహిళలు, యువతులు, విద్యార్థినులను ఎవరైన వేధిస్తే షీటీమ్‌ను సంప్రదించాలన్నారు. అత్యవసర సమయాల్లో 100కు డయల్ చేయాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వన్‌టౌన్ ఎస్సై విక్టర్, ఎస్సీ సమీకృత బాలికల వసతిగృహం వార్డెన్ సరిత, మహిళా కానిస్టేబుల్ తిరుమల, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలు అడ్డగింత

జైపూర్: మండలంలోని రామారావుపేట శివారులో సింగరేణి సంస్థ సేకరించిన రైతుల భూముల్లో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని దీనికి అధికారులు సహకరిస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు. మండలానికి చెందిన తాటిపల్లి శ్రీనివాస్ ఓపెన్‌కాస్టు సమీపంగా రైస్‌మిల్లు నిర్మాణం చేపడుతుండగా అధికారులు అక్కడికి రోడ్డు నిర్మించారని దానివల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ప్రజాఅవసరాలకు అడ్డుపడే అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. గత బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో సింగరేణి సంస్థ నుంచి ఓపెన్ కాస్టు భూముల కేటాయింపులో అనేక అక్రమాలకు పాల్పడ్డారని అలాంటి వ్యక్తులకు అధికారులు సహకరించడం మానుకోవాలన్నారు. లేకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

అన్నదానానికి చేయూత



అన్నదానానికి విరాళం అందించిన సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని గోదావరి ఒడ్డున ఉన్న మాతాశిశు ఆరోగ్య కేంద్రం వద్ద ప్రతీరోజు నిర్వహిస్తున్న అన్నదానానికి మంచిర్యాల మహిళా తరంగిణి(మమత) సభ్యులు గురువారం ఆర్థికసాయం చేసి చేయూతనందించారు. మమత అధ్యక్షురాలు రాచకొండ మంజుల, ఉపాధ్యక్షురాలు కె.లీల, కార్యదర్శి ఈ.లత, సంయుక్త కార్యదర్శి కె.పావని, కోశాధికారి నాగమణి, సభ్యులు భాగ్యలక్ష్మి, సత్యప్రియ, చంద్రకళ, జ్యోత్స్న చంద్రదత్ తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి



పూలే దంపతుల చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

లక్సెట్టిపేట: జిల్లాలోని కోటపల్లి గ్రామంలో మహాత్మా జ్యోతిబాపూలే దంపతుల విగ్రహాలు ధ్వంసం చేసినవారిని కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇటిక్యాల గ్రామంలో వారు నిరసన తెలిపారు. అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు మాట్లాడుతూ విగ్రహాలు ధ్వంసం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పూలే దంపతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. న్యాయవాది కిరణ్, నాయకులు సత్తయ్య, నారాయణ, కాంతయ్య, నరసయ్య, తిరుపతి పాల్గొన్నారు.

సేవలు అందేదెలా?



దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- దండేపల్లి పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సుల కొరత
- తగ్గుతున్న ప్రసవాల సంఖ్య

దండేపల్లి: దండేపల్లి పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సుల కొరతతో వైద్యసేవలకు కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గత కొన్నిరోజుల క్రితం వరకు ఒక రెగ్యులర్‌తోపాటు, ఇద్దరు కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు పనిచేసేది. వీరిలో రెగ్యులర్ స్టాఫ్‌నర్సు ప్రమోషన్ రాగా, ఆ ఇద్దరికి ఉద్యోగం రెగ్యులర్ కావడంతో వారు వెళ్లారు. అప్పటినుంచి పీహెచ్‌సీలో వీరి కొరత ఏర్పడింది. 24 గంటల (రౌండ్‌ది క్లాక్) ఆసుపత్రి కావడంతో, ప్రసవాల కోసం వచ్చే గర్భిణులకు స్టాఫ్‌నర్సులు లేకపోవడంతో ప్రసవాల సంఖ్య తగ్గింది. వీరి విధులను ఫీల్డ్ ఏఎన్‌ఎంలు షిఫ్టు పద్ధతిన నిర్వహిస్తున్నారు. పీహెచ్‌సీలో ప్రతినిత్యం 90 నుంచి 110 వరకు ఓపీ పేషెంట్లు వస్తుంటారు. వీరితోపాటు, ప్రతి సోమ, శుక్రవారాల్లో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తుంటారు. స్టాఫ్‌నర్సులు లేక ప్రసవాల కోసం వచ్చేవారికి ఫీల్డ్ ఏఎన్‌ఎంలు, సేవలందించే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి స్టాఫ్‌నర్సుల ఖాళీలు భర్తీ చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పీహెచ్‌సీ వైద్యుడు సతీశ్‌ను సంప్రదించగా, స్టాఫ్‌నర్సులు లేక కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పేషెంట్లకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఫీల్డ్ ఏఎన్‌ఎంలతో స్టాఫ్‌నర్సుల విధులను సర్దుబాటు చేసి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. త్వరలో ఖాళీలు భర్తీ చేస్తారు కావచ్చన్నారు.

రామన్న. .ఎక్కడున్నా రావాలే

మంచిర్యాలఅర్బన్: కొడుకా..రామన్న ఎక్కడున్నా సమ్మక్క-సారలమ్మ గద్దెలకాడికి రా.. నీకోసం తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఎదురుచూస్తున్నారు అంటూ మైకుల్లో పిలుస్తున్నారు. మంచిర్యాల గోదావరి నది తీరాన నిర్వహిస్తున్న సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా తప్పిపోయిన వారి కోసం మైకులు హోరెత్తుతున్నాయి. రద్దీలో తప్పిపోయిన వారికోసం మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. సెల్‌ఫోన్లు పడిపోయాయి.. ఎవరికైనా దొరికితే కంట్రోల్ రూం వద్దకు తీసుకురావాలని మైక్‌లో ప్రచారం చేపట్టారు. తప్పిపోయిన పిల్లలను కుటుంబసభ్యులకు అప్పగించారు.

తప్పిపోయిన పిల్లలు తల్లిదండ్రుల చెంతకు..

మంచిర్యాల గోదావరి నదితీరాన వనదేవతల జాతరలో తప్పిపోయిన పిల్లలను పోలీసులు వారి కుటుంబసభ్యుల చెంతకు చేర్చారు. గురువారం జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీసు క్యాంపులో పోలీసులు తప్పిపోయిన ముగ్గురు పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పూర్ణచందర్ పిల్లలు అశ్విత, రికిత్‌లు తప్పిపోగా చాలాసేపు మైక్‌ద్వారా ప్రచారం చేపట్టి వారి కుటుంబీకులకు అప్పగించారు. సమ్మక్క గద్దల వద్ద రద్దీని కంట్రోల్ చేసేందుకు ఎప్పటికప్పుడు వలంటరీలను మైక్‌ల ద్వారా అప్రమత్తం చేశారు.

వైద్యాధికారి వేధింపులు

- ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏఎన్‌ఎం ఆవేదన

కాసిపేట: మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి తనను వేధిస్తున్నారని సోమగూడెం రెండో ఏఎన్‌ఎం తిరుమల ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తన సమస్యలను విలేకరులకు వివరించారు. చెప్పిన మాట వినకుంటే టార్గెట్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. రెగ్యులర్ ఏఎన్‌ఎం డ్యూటీ సైతం తనకు వేస్తున్నారని వాపోయింది. సబ్‌సెంటర్‌కు వచ్చి దుర్భాషలాడుతున్నాడని, మాట వినకుంటే గైర్హాజరు వేస్తున్నట్లు తెలిపింది. జిల్లా అధికారులు స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ విషయమై వైద్యాధికారి రవికిరణ్‌ను వివరణ కోరగా ఈనెల 20న ఆరోగ్య మహిళా క్లినిక్ కార్యక్రమానికి గైర్హాజరైంది. ఫోన్‌లో స్పందించలేదని గైర్హాజరు వేశామన్నారు. అప్పటి నుంచి ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తోందని తెలిపారు.